నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | MEDAK

మెదక్ జిల్లా చిలిపిచెడ్ రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

రైతులను ముంచిన కాంగ్రెస్

- బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు
- రూ.2లక్షలకు పైగా పంట రుణాల మాటేమిటి..?
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- మెదక్ జిల్లా చిలిపిచెడ్ రైతు వేదికలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలిపిచెడ్, ఆగస్టు 31:రూ.2లక్షల పంట రుణమాఫీ అంటూ గొప్పగా ప్రచారం చేస్తే నమ్మి ఓట్లేసి గెలిపించిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని రైతు వేదికలో 40 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులందరికీ రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పినా కనీసం 40 శాతం కూడా మాఫీ కాలేదని ఆరోపించారు. అర్హులందరికీ చేయలేక ఇంటింటి సర్వే చేస్తామని కొత్త నాటకానికి తెరతీశారని, అర్హులైన రైతులను గుర్తించి చేదెప్పుడు, పంటరుణమాఫీ అయ్యేదెప్పుడు అని ప్రశ్నించారు. పంటరుణమాఫీ చేయలేక కాలయాపన కోసమే ఇంటింటి సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పంటరుణమాఫీ చేసినప్పుడు ఇవేమీ అడ్డంకులు పెట్టలేదని, కాంగ్రెస్ కొర్రీలు పెట్టి రైతులను ముప్పుతిప్పలు పెట్టడంతోపాటు ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రైతులకు పంటరుణమాఫీ ముసుగులో రైతు బంధు కట్‌చేయడంతోపాటు వృద్ధులకు రూ.4వేల పింఛన్లు రద్దు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిలిపిచెడ్ మండలంలోని గిరిజన తండాల్లో బీటీ రోడ్ల కోసం అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.10కోట్లు రద్దు చేయడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గడ్డం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు దుర్గారెడ్డి, సయ్యద్‌హుస్సేన్, కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, షేఫియుద్దీన్, శంకరయ్య, భీమయ్య, వీరస్వామి, శంకర్‌నాయక్, భిక్షపతినాయక్, రాకేశ్‌నాయక్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా కౌడిపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిత్తశుద్ధి ఉంటే నిధులు తీసుకురావాలి

కౌడిపల్లి, ఆగస్టు 31:కాంగ్రెస్‌లోకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకురావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిషత్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలంలో అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే కాంగ్రెస్ నాయకులు వేదికలపైకి వచ్చి గొడవలు చేస్తే సహించేదిలేదన్నారు. మాజీ ఎంపీపీ రాజునాయక్, మాజీవైస్ ఎంపీపీ నవిన్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి,రాజు, ప్రవీణ్, ఎల్లం, ప్రవీణ్‌రెడ్డి, ప్రతాప్‌గౌడ్, రవిసాగర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సంగారెడ్డి జిల్లా కంది మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలి
- ధరణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- సంగారెడ్డి జిల్లా కంది మండలంలో ఆకస్మిక తనిఖీలు

కంది తహసీల్ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కంది, ఆగస్టు 31:ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది మండలంలో ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, తహసీల్ కార్యాలయం, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించి, ప్రభుత్వ దవాఖానలో అందుతున్న అన్ని రకాల వైద్య చికిత్సలు, పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించి వినియోగించుకునేలా చూడాలన్నారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వ భూములపై గట్టి నిఘా పెట్టాలి

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా గట్టి నిఘా పెట్టాలని తహసీల్దార్ విజయలక్ష్మిని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి భూ రికార్డులు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, ధరణి ఫిర్యాదుల పరిష్కారం తదితర వాటిని పరిశీలించారు. భూ రికార్డుల ఫైల్స్‌ను భద్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, శిఖం భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాని ఆదేశించారు. ధరణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అవసరమైతే తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

విద్యార్థులతో కలిసి భోజనం

కంది మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారికి అందుతున్న బోధనను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించే భోజనం, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. వంటశాల, తరగతి గదులు, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాని కెళ్లి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, రికార్డులను పరిశీలించారు. ఏపీజీవీబీని సందర్శించి రుణమాఫీ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, ఎంపీవో మహేందర్‌రెడ్డి, జీపీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

టీసీలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31: భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, పోలీస్, వైద్యారోగ్యశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోలెవల్ వంతెనలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 2200 చెరువులు, కుంటలు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే 600 చెరువులు పూర్తిగా నిండాయన్నారు. రాత్రి వర్షం కురిస్తే చెరువులు, కుంటలు తెగిపోయే అవకాశం ఉన్నందున ప్రమాదకరమైన చెరువులు, కుంటలను గుర్తించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నో టీసులకు హైడ్రా రెడీ..!

పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్సీపురంలో కమిషనర్ పర్యటన

- నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం కావాలని ఆదేశాలు
- ఏండ్ల క్రితమే బఫర్‌జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు
- నాడు అనుతులిచ్చి నేడు అధికారుల అభ్యంతరాలు
- అధికారులు, ప్రభుత్వం తీరుపై సామాన్యుల్లో ఆగ్రహం
- ఆందోళనలో పేదలు.. హైడ్రాపై కాంగ్రెస్ నేతల పెదవి విరుపు

సంగారెడ్డి, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోనూ హైడ్రా గుబులు కమ్ముకుంది. చెరువులు, కుంటలను పరిరక్షించేందుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నది. శనివారం పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం కావాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో హైడ్రా నోటీసులపై సామాన్యుల్లో భయం నెలకొంది. నోటీసులు వచ్చిన వెంటనే తమ ఇండ్లను కూల్చివేస్తారని సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు. చెరువుల, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు ఉన్నాయని ఇప్పుడు హైడ్రా నోటీసులు ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చారని, నాడు సక్రమమైన నిర్మాణాలు ఇప్పుడు అక్రమం ఎలా అయ్యాయని ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల పేరు తో ఇండ్లను కూల్చేముందు అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏండ్ల క్రితం ఇండ్లు నిర్మించుకుని ఉండగా, ఇప్పుడు వచ్చి ఇండ్లు కూలుస్తామని చెప్పడం సరికాదంటున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల్లోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలోని నిర్మాణాలపై కోర్టుల్లో కేసులు ఉండడంతో పాటు స్టేలు ఉన్నాయి. దీనికి తోడు ఎన్‌జీటీ సైతం స్టేలు ఇచ్చింది. హైడ్రా వీటిని పరిశీలిస్తుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

శనివారం పటాన్‌చెరు సాకీ చెరువు నక్షాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

కమిషనర్ పర్యటనతో...

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయంటూ నోటీసులు ఇచ్చేందుకు హైడ్రా సన్నద్ధమవుతున్నది. శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో పలు చెరువులను పరిశీలించి అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల అక్రమణ, నిర్మాణాల గురించి ఆరాతీశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇవ్వాల్సిందిగా హైడ్రా కమిషనర్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో త్వరలో హైడ్రా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. పటాన్‌చెరులోని సాకి చెరువు, అమీన్‌పూర్‌లోని శంభునికుంట, శెట్టికుంట, పెద్దచెరువు, బందం కొమ్ము చెరువుల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడతో పాటు మరికొన్ని గ్రామాల్లో చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమ నిర్మాణాలపైనా హైడ్రా దృష్టిపెట్టినట్లు సమాచారం. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, ఉస్మాన్‌గనర్‌లోని చెలికుంట, వనం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాల పైనా అధికారులు వివరాలు సేకరించారు.ఇక్కడ కూడా హైడ్రా నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏండ్ల క్రితమే చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అధికారులు ఇండ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. నాడు అనుమతులు ఇచ్చిన అధికారులపై మొదట చర్యలు తీసుకోవాలని, ఆ తర్వాతే సామాన్యులకు నోటీసులు ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతున్నది.

అక్రమ నిర్మాణాలపై ఆరా

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ నడిబొడ్డున ఉన్న సాకీ చెరువులో ఆక్రమణల పరిశీలన
- కోర్టు కేసులపై అధికారులను వివరాలు కోరిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు, ఆగస్టు 31: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ నడిబొడ్డున ఉన్న సాకీ చెరువులోని ఆక్రమణలను శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చెరువులోంచి వేసిన రోడ్డుగుండా శాంతినగర్‌కాలనీ ఎంట్రెన్స్‌లో ఆగి అక్కడ ఉన్న ఇండ్లను పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగారు. ఆ నిర్మాణాల్లో అధిక శాతం సాకీ చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని అధికారులు ఆయనకు తెలిపారు. కొందరు కోర్టులో కేసులు వేశారని వివరించారు. కోర్టు కేసుల వివరాలు తనకు తెలుపాలని కమిషనర్ సూచించారు. ఇప్పటికే 18 అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, చాలాకాలం క్రితమే ఇండ్ల నిర్మాణం జరిగినట్లు ఉన్నదని రంగనాథ్ తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని వివరించారు. సాకీ చెరువు తూములు మూసివేసి ప్రముఖ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్లు కడుతున్నదని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన రంగనాథ్ చెరువుకు సంబంధించి ఎలాంటి ఆక్రమణలు ఉన్నా పరిశీలించి, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోపణలు వచ్చిన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు.నక్కవాగు బఫర్‌జోన్‌లో భారీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని, నక్కవాగుకు వచ్చే కాల్వలు గల్లంతయ్యాయని పలువురు విలేకరులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ తక్షణమే ఇరిగేషన్‌శాఖ అధికారుల వివరణ తీసుకున్నారు. అక్కడ పర్మిషన్లు తీసుకుని నిర్మాణాలు చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. పర్మిషన్లతో కొన్ని నిర్మాణాలు ఉన్నాయని సందేహాస్పదంగా వివరణ ఇవ్వడంతో ఆయన నక్కవాగుకు సంబంధించి వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం సాకీ చెరువు నక్షను పరిశీలించి వాటిలోని ఆక్రమణలను తెలుసుకున్నారు.

శనివారం అమీన్‌పూర్ ఇరిగేషన్ డీఈ రామస్వామిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

అమీన్‌పూర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

అమీన్‌పూర్, ఆగస్టు 31: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ విస్తృతంగా పర్యటించారు. అక్రమ నిర్మాణాలపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు.అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు,కుంటలను తనిఖీ చేశారు. ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్ నాలా కబ్జాలపై ఆరా తీశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన కట్టడాల వెనుక ఎవరు ఉన్నా పదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యలతో బడాబిల్డర్లు, నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్‌శాఖల అధికారులు, సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

భూములు తీసుకుంటే బతికేదెలా..?

- బలవంతంగా భూములు తీసుకుంటే చూస్తూ ఊరుకోం
- ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల రైతుల ఆవేదన

న్యాల్‌కల్, ఆగస్టు 31:మాకు వ్యవసాయమే జీవనాధారం. ఏడాదికి రెండు, మూడు పంటలు పండే భూములను ఫార్మాసిటీ కోసం తీసుకుంటే ఎలా బతకాలని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు చెందిన 2,003 ఎకరాల భూములను తీసుకుంటే రోడ్డుపాలు కావాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ ఎన్నో ఏండ్లుగా సాగుచేసుకుంటున్న భూములను మాత్రం ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ఎంత వరకైనా సరే ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం, కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలు వస్తే తమ బతుకులు ఆగమవుతాయని, ఎక్కడికో, ఏ ప్రాంతానికో కుటుంబాలు వలస పోవాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమి నుంచి వేరు చేస్తే పుట్టెడు దుఃఖం

మనిషి పుట్టింది మొదలు భూమితో విడదీయని అనుబంధం ఉంటున్నది. అది కేవలం భౌతికమైనది. యాజమాన్య భావనకు సంబంధించి మాత్రమే కాదు. అందుకు అతీతమైన మరేదో బంధం శాశ్వత భావనతో కట్టిపడేస్తుంది. అందుకే అంటారు గంటెడైనా, గుండెడైనా.. భూమి ఉంటే ఆభరోసాయేవేరు అని. ఆస్తిగానే కాదు భూమి అస్తిత్వపు ఉనికిగా, భూమికగా, చిరునామాగా ఆ సమాజం చూస్తున్నది. కాబట్టి మనిషికి అంతటి పెనుగులాట. తాను నమ్ముకున్న భూమి తనకు కాకుండా పోతుందంటే రోజులు, నెలలు, ఏండ్ల తరబడి ఏడుస్తారు. రక్తం చిందించాల్సి వస్తుందని తెలిసినా నిరసనతో రోడ్డెక్కుతారు. తాను గతించాక కుటుంబం ఆగమైతదని తెలిసినా.. ఆత్మహత్యకు సాహసిస్తాడు. మట్టికి-మనిషికి ఉన్న బంధం అలాంటిది. ఇది గ్రహించని ప్రభుత్వాలు తాతలు, ముత్తాతల కాలంగా వచ్చినా, కొనుగోలు చేసిన పట్టా, పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములను తీసుకుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదంటున్నారు రైతులు. ఫార్మాసిటీ కోసం న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్‌లో 1465.25 ఎకరాలు, మల్గిలో 282,13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల భూములు కోల్పోతున్న రైతులను శనివారం 'నమస్తే తెలంగాణ' పలకరిస్తే తమ కన్నీటి గాథలను వెలిబుచ్చారు.

సంగారెడ్డి జిల్లా డప్పూర్ గ్రామ శివారులోని సాగులో పచ్చని పంటలు

మేము భూములివ్వం

మాకు ఉండేది ఎకరం భూమి. ఇది ఫార్మాసిటీకి ఇస్తే ఎలా బతకాలి. వారు ఇచ్చే పరిహారంతో మాకు మరో చోట భూమి రాదు. కుటుంబ జీవనం అస్తవ్యస్తమవుతున్నది. అందుకే మేం భూములివ్వం. ప్రాణాలు పోయినా సరే ఇచ్చేది లేదు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి లేకుంటే ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం.

-బుర్జు విఠల్‌గౌడ్, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

కడుపు కొట్టొద్దు

భూములపైనే ఆధారపడి బతికే పేద రైతులం. వాటిని తీసుకుంటే మేం బతకలేము. భూములకు ఎన్ని లక్షలు ఇచ్చినా మాకొద్దు. సాగు భూములు తీసుకుని రైతుల పొట్టకొట్టొద్దు. కంపెనీలు పెట్టి మమ్ముల్ని ఇబ్బందులు పెట్టొద్దు. వాటి కాలుష్యంతో మాకే నష్టం.

– డొప్పూరు గుండన్న, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

మా భూములు మాకే ఉండాలి

మాకు ఫార్మాసిటీ వద్దే వద్దు. మా భూములు మాకే ఉండాలి. సాగు భూములు కంపెనీలకు ఇచ్చి మేము ఎలా బతకాలి. గుట్టుచప్పుడు కాకుండా దొంగచాటున సర్వేలు చేసి భూములను తీసుకోవడం సరికాదు. ప్రాణాలు పోయినా సరే భూములు మాత్రం ఫార్మాసిటీకి ఇచ్చేది లేదు. వాటి వల్ల రైతులకు నష్టం తప్ప లాభం లేదు.

– పుండికూర రవి, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

మమ్మల్ని బజారుపాలు చేయొద్దు

ఫార్మాసిటీ కోసం సాగు భూములు లాక్కొని మమ్ముల్ని బజారు పాలు చేయొద్దు. ఏడాదికి రెండు, మూడు పంటలు పండించుకునే భూములనే నమ్ముకుని రైతులందరం ఉన్నదాంట్లో సంతోషంగా బతుకుతున్నాం. ఇప్పుడు పచ్చని పంట భూములను కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలకు ఇస్తే రైతులు ఏం కావాలి. మా కుటుంబమంతా ఎక్కడికి వెళ్లాలి.

– వెంకటమ్మ, మహిళా రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

- సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కమలాయపల్లిలో ఇండ్లలోకి వరదనీరు
- ఇబ్బందులు పడుతున్నగ్రామస్తులు

వానొస్తే.. నీటమునగాల్సిందే..!

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 31: వానొచ్చిందంటే..ఆ ఊరిలోని రోడ్డు వెంబడి ఇండ్లన్నీ నీటమునగాల్సిందే..! ఇండ్లలోకి చేరిన వర్షపునీటితో కొన్నేండ్లుగా పలు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని కమలాయపల్లి మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఇండ్లలోకి వర్షపు నీరు చేరుతున్నది. వర్షపునీరు చేరడం వల్ల ఇంట్లోని సామగ్రి పూర్తిగా తడిసిముద్దవుతున్నది. అర్జున్‌పట్ల-దానంపల్లి గ్రామాల మధ్య గతంలో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణం వల్ల రోడ్డు పక్కన ఉన్న ఇండ్లన్నీ కిందికయ్యాయి. దీంతో వర్షం వస్తే చాలు రోడ్డు వెంబడి వరదనీరంతా రోడ్డు పక్కన ఉన్న ఇండ్లలోకి చేరుకుంటున్నది. వర్షపు నీరు ఇండ్లలోకి చేరడం వల్ల పలు పెంకుటిండ్లు ఇప్పటికే నేల మట్టమయ్యాయి. వర్షపునీటి వల్ల పాఠశాల కాంపౌండ్ కూడా కూలిపోయింది. తరుచూ ఇండ్లలోకి నీరు చేరడం వల్ల నిరుపేదలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవనం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. బీటీ రోడ్డు వెంబడి సైడ్ డ్రైన్ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. రోడ్డుకు దిగువన ఉన్న ఇండ్లను తొలిగించి కొత్త ఇండ్లు నిర్మించాల్సిన అవసరం ఉన్నది.సమస్యను పరిష్కరించాలని ఇటీవల గ్రామాన్ని సందర్శించిన మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో ఓ ఇంటిలోకి చేరిన వర్షపునీరు

జవాబుదారీగా పనిచేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): జవాబుదారీగా పనిచేసే ప్రతి అధికారి ప్రజల మన్ననలు పొందుతారని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో పరిశ్రమల శాఖ జీఎం కృష్ణమూర్తి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎస్సీ సంక్షేమాధికారి విజయలక్ష్మి హాజరై కృష్ణమూర్తి దంపతులకు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులపై నిబద్ధత, అంకిత భావం కలిగిన వ్యక్తి జీఎం ఇండస్ట్రీస్ కృష్ణమూర్తి అని అన్నారు. అనంతరం జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు హెల్త్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎఫ్‌వో రవిప్రకాశ్, హార్టికల్చర్ నరసయ్య, డీఎస్‌వో బ్రహ్మారావులను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమూర్తి దంపతులను సన